# జాక్‌పాట్

రంగనాథం ఆ రోజు ఇంటికి ఆలస్యంగా వచ్చాడు.

ఆలస్యంగా వచ్చినా ఉషారుగానే వున్నాడు.

ఆలస్యంగా వచ్చినప్పుడల్లా భార్య సుందరమ్మ వెయ్యబోయే ప్రశ్నలకు సమాధానాలను మననం చేసుకుంటూ, తల వేలాడేసుకొని గడపలో అడుగు పెట్టేవాడు.

ఆఫీసులో చచ్చేంత చాకిరీ వుందనీ, పనిపూర్తి చేసిగాని కదలడానికి వీల్లేదని ఆఫీసరు అన్నాడనీ కొన్నాళ్ళు చెప్పేవాడు.

మధ్య మధ్య కొత్త జవాబులుకూడా చెప్పేవాడు. భార్య మూడ్‌కు అనుకూలంగా సమాధానాలు చెప్పేవాడు.

ఒక రోజు— ఆఫీసులో గుమాస్తా ఒకడు అకస్మాత్తుగా గుండెనొప్పి వచ్చి కుర్చీలో ఒరిగిపోతే అతణ్ణి తను ఎలా ఆసుపత్రికి చేర్చిందీ చెబితే ...

రెండోనాడు...తన సెక్షన్ సూపర్నెంటు పెళ్ళానికి సడన్‌గా జబ్బు చేసిందని ఫోను వస్తే తను ఎలా అతనికి ధైర్యం చెప్పి ఇంటికి చేర్చిందీ వివరిస్తే...

మరోనాడు... తను ఎక్కిన బస్ అమాంతంగా ఆగిపోయి, వెంట్రుకవాసిలో యాక్సిడెంటు కాకుండా డ్రైవర్ తెలివిగా దాన్ని ఆపేసి అందర్నీ మరో బస్‌లోకి ఎలా ఎక్కించాడో చెప్పేవాడు.

అలా...అలా...ఆలశ్యానికి కారణాలు వల్లించేవాడు రంగనాథం.

కాని ఆ రోజు రంగనాథం తలెత్తుకొని ఎదురుగా రుసరుసలాడుతున్న భార్యను చూసీ చూడనట్టే లోపలకు వచ్చాడు.

సుందరమ్మ అంత నిర్లక్ష్యంగా, ధైర్యంగా లోపలకు వస్తున్న భర్తను ఎగాదిగా చూసింది,

సుందరమ్మకు భర్త వాలకం అర్థం కాలేదు.

ఆ సాయంత్రం చేమంతిపూలవాడితో పడిన తగాదా తాలూకు చిరచిర చేమంతి పూలతోపాటు ఆమె మెదడులో తిరుగుతూనేవుంది.

అసలే చిరాకుగా ఉన్న సుందరమ్మకు భర్త వాలకం చూసి వళ్ళు మండిపోయింది.

భర్తకేసి చురచుర చూసింది.

రంగనాథం చూసీచూడనట్లే ఉత్సాహంగా లోపలకు వచ్చాడు.

సుందరమ్మ ఆశ్చర్యంగా భర్త ముఖంలోకి చూసింది.

రంగనాథం వాలుకుర్చీలో కూర్చుంటూ "పాలుంటే కాఫీ పెట్టు" అన్నాడు ఉత్సాహంగా.

"నువ్వు రంగనాథానివేనా?"

"అసలు నువ్వు నా మొగుడివేనా?"

అన్నట్టు తెల్లబోయి చూసింది సుందరమ్మ.

"ఏమిటి అలా చూస్తావ్? పాలు లేవా? ఆకలేస్తుంది. పోనియ్ త్వరగా అన్నం వడ్డించు" కుర్చీలో నుంచి లేచి చొక్కా విడిచి చిలకకొయ్యకు తగిలిస్తూ దబాయింపుగా అన్నాడు రంగనాథం.

భర్త కంఠంలోని అధికారం సుందరమ్మ నెత్తిమీద సుత్తిదెబ్బలా తగిలింది.

వెర్రిదానిలా చూసింది.

బట్టలు మార్చుకొని భార్యకేసి చూడకుండానే కాళ్లూ చేతులూ కడుక్కోనేందుకు బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు రంగనాథం.

అతని నడకలో ఏదో మార్పు, ఠీవి కన్పించాయి సుందరమ్మకు.

సుందరమ్మకు రంగనాథంతో పెళ్ళి అయిన రోజులు గుర్తొచ్చాయి.

పొగరుబోతు గిత్తను బండికి కట్టి, అర్రు చేసి దారికి తెచ్చినట్టు, సుందరమ్మ నలుగురు ఆడపిల్లల్నీ, ఇద్దరు మొగ పిల్లల్నీ కని, రంగనాథం నెత్తిమీద పెట్టి మాడు చితకగొట్టింది. అతన్ని దారికి లాక్కొచ్చింది. ఆదాయం తక్కువ, అవసరాలు ఎక్కువ. పెళ్ళాం దృష్టిలో అలుసు అయిపోయాడు. భార్య అంటే భయం ఏర్పడింది. ఉద్యోగంమీద శ్రద్ధ ఏర్పడింది.

ఉద్యోగంమీది శ్రద్ధతోపాటు ఆఫీసులో ఆఫీసర్లంటే కూడా భయం ఎక్కువయింది.

ఇక పోతే పిల్లలంటే మాత్రం భయపడేవాడు కాదు. పిల్లలకూ తండ్రి అంటే భయం పోయింది.

రంగనాథం వంటింట్లో పీట వాల్చుకుని కూర్చున్నాడు.

సుందరమ్మ ఆశ్చర్యంతో తలమునకలై పోతూనే యాంత్రికంగా అన్నం వడ్డించింది.

పీటమీద బాసింపట్లు వేసుక్కూర్చుని అన్నం కలుపుకుంటున్న భర్తను పరకాయించి చూసింది.

"ఏమిటి విశేషం? సీటు మారిందా?" మనసులోనే అనుకుంది.

సీటు మారడం అంటే సుందరమ్మ దృష్టిలో భర్త ప్రయోజకుడైనట్టే. సీటు మారడం—అంటే ఎస్టాబ్లిష్‌మెంటు సీటులోకి రావడం లాభసాటి బేరం అని సుందరమ్మకు తెలుసు. ఆమె మెదడులోకి ఆ ఆలోచనను ఎక్కించింది రంగనాథమే

అదే ఆఫీసులో పనిచేసే శర్మ రెండిళ్ళకు అవతల ఇంట్లో ఉంటాడు. అతనూ రంగనాథంలా గుమాస్తాగిరే చేస్తున్నాడు. కాని అతని యిల్లు ఒక గుమాస్తా ఇల్లులా ఉండదు. సోఫాలూ, ఫాన్లూ మొదలైన హంగులతో ఆఫీసరు ఇల్లులా ఉంటుంది. అతని పెళ్ళాం సుందరమ్మలా గుంటూరు ముతక నేత-చీరలు కట్టదు. అతని పిల్లలు తన పిల్లల్లా ప్రతిదానికీ ముఖం వాచి పోతూ కన్పించరు. సుందరమ్మకు మొదట్లో అర్థంకాలేదు. ఆస్తిపాస్తులు ఉన్నాయేమో అనుకుంది.

కాని రంగనాథమే చెప్పాడు. అతనికి వెనక ఏమీ లేదనీ, ఎస్టాబ్లిష్‌మెంటు సీటులోకి వచ్చేంతవరకూ తనలాగే ఉన్నాడనీ.

సుందరమ్మ ముందు ఆశ్చర్యపోయింది. ఆ సీటులో వున్న అవకాశాల్ని గురించి రంగనాథం చెప్పాక అసలు సంగతి అర్థం అయింది.

అప్పటినుంచి భర్తను ఆ సీటు ఎలాగయినా సంపాదించుకోమని చెప్పసాగింది. మొదట మురిపెంగా చెప్పింది. ఆ తర్వాత విసుగ్గా చెప్పింది. క్రమంగా సుందరమ్మ దృష్టిలో భర్త అసమర్థుడిగా మిగిలిపోయాడు. అప్పటినుంచీ రంగనాథానికి భార్య అంటే హడల్.

ఆలస్యంగా వచ్చినప్పుడల్లా ఆఫీసర్ మెప్పుకోసం చచ్చే చాకిరి చేస్తున్నాననీ, త్వరలోనే ఆఫీసరు మెప్పును పొందుతాననీ చెప్పేవాడు,

ఆ సీట్లో పడితే తనూ ఆ శర్మ పెళ్ళాంలా ఒక వెలుగు వెలగవచ్చని సుందరమ్మ రోజూ ఏడుకొండలవాడిని సీటు మార్పుకోసం ప్రార్థిస్తూ వుంటుంది. ముఖం వేలాడేసుకొని ఇల్లుచేరే భర్తను చూడగానే అరికాలుమంట నెత్తికి ఎక్కేది.

తలైనా తిప్పకుండా భోజనం చేస్తున్న భర్తను చూస్తూ 'సీటుమారి ఉంటుంది. అందుకే పెద్ద బెట్టు చేస్తున్నాడు' అనుకుంది. అయినా సుందరమ్మకు భర్తమీద కోపం రాలేదు.

"ఆ ఏడుకొండలవాడు ఇంతకాలానికి నా ప్రార్థన ఆలకించాడు. ఆ శుభవార్త నాకు చెప్పకూడదా ఏమిటి:"

మురిసిపోతూ గిన్నెలో ఉన్న పెరుగంతా భర్త కంచం లోకి కుమ్మరించింది.

'అందులో కూడా నీప్రతాపమేనేమిటేవ్? నీ పూజలకు ఏడుకొండలవాడు మెచ్చడం కాదు, నా జాతకం తిరిగిందే?'

రంగనాథం భార్యను చాలాకాలంతర్వాత ' ఏమే ' అంటూ సంబోధించాడు.

'అయితే ఇవ్వాళ కొత్త సీటుకు వెళ్ళారన్నమాట!' చాలా కాలం తర్వాత భర్తను బహువచనంతో సంబోధించింది సుందరమ్మ.

పెరుగు చేతివేళ్ళను నాకుతూ సమాధానం ఇవ్వలేదు రంగనాథం.

"సీటులోకి వచ్చి రాకముందే మనిషిలోకి రాజకళ

వచ్చిందే?" అంటూ చేతులు తుడుచుకోవడానికి టవల్ అందిం చింది సుందరమ్మ.

"పెళ్ళామయినా, పిల్లలయినా—అంతా తన సంపాదనను బట్టే ప్రవర్తిస్తారన్నమాట!" చేతులు తుడుచుకుంటూ అనుకున్నాడు రంగనాథం.

రంగనాథం వెళ్ళి మంచంమీద కూర్చున్నాడు.

సుందరమ్మ వక్క పొడి డబ్బా అందించి పక్కన కూర్చుంది.

"ఏమండీ? మిగతా వాళ్ళంతా మిమ్మల్ని చూసి ఏడుస్తున్నారా?" ముద్దుముద్దుగా అడిగింది సుందరమ్మ.

తనభర్త ఏనాటికైనా ఎస్టాబ్లిష్‌మెంటు సీటుకి వస్తాడనీ, అప్పుడు శర్మభార్యతోపాటు ఇరుగుపొరుగు వాళ్ళంతా తనను చూసి ఈర్ష్యపడతారనీ... కాదు... పడాలనీ, సుందరమ్మ చిరకాల అభిలాష.

"ఇంకా మారలేదులేవే!" అన్నాడు రంగనాథం.

సుందరమ్మ చివ్వున తలెత్తి చూసింది. భర్త చేతిలో వున్న వక్కపొడి డబ్బాను విసురుగా లాక్కుంది.

"అసలు నీ వ్యవహారం ఏమిటీ?" అన్నట్టు చురచుర చూడసాగింది.

"సీటు మారటం ఊహ లెక్కేమిటే సుందీ? ఎస్టాబ్లిష్‌మెంటు సూపర్నెంటునే అయిపోతాను"'

"నిజంగా? ఆఫీసర్‌కు మీరంటే అంత ఇష్టం కలిగిందా?"

"ఎందుకాకూడదూ...ఏభై వేలు... ఏకదమ్మున్న అరలక్ష రూపాయలు ... ఏమిటనుకున్నావు?" అన్నాడు కళ్ళెగరేస్తూ.

సుందరమ్మకు మాటలే కరువైనాయి. వక్క పొడి మూతతీసి భర్తకు అందించింది.

రంగనాథం వక్కపలుకు పటుక్కు కొరుకుతూ "జాక్‌పాట్... ఏమిటనుకున్నావ్?"అన్నాడు.

"మనకేనా అరలక్ష వచ్చింది?"ఆనందంతో తల మునకలైపోతూ అడిగింది సుందరమ్మ.

"కాదు ఆఫీసరుకు..."

సుందరమ్మ వెర్రిదానిలా చూసింది.

"ఏమిటే అలా చూస్తావ్? ఆఫీసర్‌కు అరలక్ష జాక్‌పాట్‌లో వచ్చింది. ఆ దెబ్బతో అసలు జాక్‌పాట్ నాకే వచ్చిందనుకో..."

సుందరమ్మ అయోమయంగా చూసింది.

"ఆయనకు జాక్‌పాట్ నావల్లే వచ్చింది. దానికి ప్రతిఫలంగా నేను రేపే ఎస్టాబ్లిష్‌మెంటులోకి ప్రవేశిస్తాను..."

"నా కర్థం కావడంలేదు సరిగా చెప్పండీ?"

"అదంతా నీకెందుకుకాని ఇక నువ్వు ఆ శర్మపెళ్ళాం కంటే గొప్పగా వెలిగిపోవచ్చు రేపటినుంచీ?"

"ఎస్టాబ్లిష్‌మెంటు సీట్లో లక్ష్మీదేవి తాండవిస్తుందని అన్నారు కదూ?"

"ఓ ! ఇక లక్ష్మీదేవి మనింట్లో గలగల లాడుతూ ఎలా తిరుగుతుందో చూస్తావుగా!"

"ఏమండీ! నాకు బనారస్ చీర కొనిపెట్టరూ?"

"ఒక్కటేనా ?"

"మెడ బోసిగా ఉంది. బొందు గొలుసూ, నల్ల పూసలు గొలుసూ..."

"చేతులు మాత్రం బోసిగా లేవూ'"

'ఆడపిల్లలిద్దరికీ ...'

"కొంచెం ఓపిక పట్టవే అన్నీ వస్తాయ్!" ముసిముసిగా నవ్వుతూ అన్నాడు రంగనాథం.

ఆ సమయంలో సుందరమ్మకు రంగనాథం ఎంతో ముద్దొచ్చాడు.

"అసలు ఇంతకూ ఏం జరిగిందో చెబుదురూ?" దగ్గిరగా జరిగింది సుందరమ్మ.

సుందరమ్మ అడ్డ ప్రశ్నలు వెయ్యకుండా రంగనాథం చేత ఆనాడు జరిగిందంతా చెప్పించాలంటే అంత తేలిగ్గా అయ్యే పనికాదు.

ఆ సంగతేదో తెలియకపోతే కథ పూర్తికాదు ... అందుకే...

ఇంతకూ ఆనాడు ఏం జరిగిందంటే?

ఆ రోజు రంగనాథం ఆదరా బాదరాగా ఆఫీసులో అడుగుపెట్టాడు.

"తమర్ని ఆఫీసరుగారు పిలుస్తున్నారు."

అర్థ గంట ఆలస్యంగా వచ్చిన రంగనాథం అరిచేతులకు పట్టిన చెమటను షర్టుకు తుడుచుకుంటూ గాబరాగా ఆఫీసరు గదిలోకి అడుగుపెట్టాడు.

చేతులు కట్టుకొని వణికిపోతూ నిల్చున్నాడు.

"కూర్చో!"

రంగనాథం ఆశ్చర్యంగా ఆఫీసరు ముఖంలోకి చూశాడు. అతను నవ్వుతూ ఉన్నాడు.

"కూర్చో!"

"చెప్పండి సర్!" నిల్చునే అన్నాడు రంగనాథం భయంగా.

"నీకు జ్యోతిష్యం తెలుసా?"

"తెలియదు" అనబోయి "అంత బాగా తెలియదు సర్!" అన్నాడు.

రంగనాథానికి నిజంగా జ్యోతిష్యం తెలియదు. కాని అప్పుడప్పుడు తెలిసినట్టు ఆఫీసులో వాళ్ళకు వారి భవిష్యత్తు గురించి చెబుతూ ఉంటాడు.

రంగనాథం గుండెలు దడదడలాడాయి.

"కూర్చోవయ్యా!"

అయినా రంగనాథం కూర్చోలేదు.

"సరే ఐదు నంబర్లు చెప్పు!"

రంగనాథం బెదిరిపోతూ ఆఫీసరు ముఖంలోకి చూశాడు.

"నాకు ఏ నంబర్లమీద లక్ వుందనిపిస్తే అవి ఐదు చెప్పు" అన్నాడు ఆఫీసరు.

"నాలుగు, రెండూ, ఒకటి, ఏడు, ఆరు" గబగబా అనేశాడు.

ఆఫీసరు నోట్ చేసుకొని 'థ్యాంక్యూ!' అన్నాడు.

రంగనాథం బ్రతుకు జీవుడా అని బయటపడ్డాడు. సీటులో కూర్చున్న పది నిముషాలకుగాని ప్రాణం కుదుట పడలేదు.

ఎంత పని చేసినా ఒక్కరోజూ ఆ ఆఫీసరు తనకు థ్యాంక్సు చెప్పలేదు. ఎందుకు అడిగాడో అంతలోనే గుర్తొచ్చింది. ఆ రోజు ఊళ్ళో గుర్రపు పందాలు ఉన్నాయని.

ఆ అయిదు నంబర్లూ తన లక్కీనంబర్లనుకొని ఓడిపోతే? తనకు జోతిష్యం తెలిసినట్టు 'టాం టాం' వేసుకున్నందుకు మనసులోనే చెంపలు వేసుకున్నాడు. ఆ రోజంతా అన్య మనస్కంగానే ఉన్నాడు.

అయిదున్నర అయింది. పగలంతా కబుర్లు చెప్పుకున్న వాళ్ళు బిజీగా ఫైల్సు రాయసాగారు.

అకస్మాత్తుగా సెక్షన్‌లోకి వచ్చిన ఆఫీసర్ను చూసి అందరూ చివ్వుని లేచి నిల్చున్నారు. ఆఫీసరు నవ్వుకుంటూ రంగనాథం టేబుల్ దగ్గరకు వచ్చి నిల్చున్నాడు.

"థ్యాంక్యూ రంగనాథం! నీ జోతిష్యంవల్ల నాకు ఇవ్వాళ ఏభయివేలు జాక్‌పాట్‌లో వచ్చాయి" అన్నాడు.

రంగనాథం సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నాడు.

కొందరు ఆశ్చర్యంగా, మరికొందరు ఈర్ష్యగా ఇద్దర్నీ చూస్తూ నిలబడ్డారు.

"ఇవ్వాళ మీ అందరికీ పార్టీ ఇస్తున్నాను" అన్నాడు ఆఫీసరు.

గంటలో పార్టీకి కావాల్సిన స్వీట్సూ, హాట్సూ వచ్చేసాయి. ఆఫీసరు అందరితో నవ్వుతూ మాట్లాడాడు. కులాసా కబుర్లు చెప్పి నవ్వించాడు. రంగనాథాన్ని తన పక్కనే కూర్చోబెట్టుకొని మరో స్వీట్ తినిపించాడు.

రంగనాథానికి అకస్మాత్తుగా తను లావుగా ఎత్తుగా పెరిగిపోయినట్టు అనిపించసాగింది.

పార్టీ పూర్తి అయింది.

షణ్ముగం రంగనాథం దగ్గరకు వచ్చి "రేపు ఆఫీసరుగార్ని అడిగి ఎస్టాబ్లిష్‌మెంటు సెక్షన్‌లో వేయించుకో మళ్ళీ ఆలస్యం అయితే మూడ్ మారిపోవచ్చు. ఆ శర్మగాడికి మరీ పొగరు ఎక్కువైంది" అన్నాడు.

రంగనాథం హుందాగా నవ్వాడు. సమాధానం ఇవ్వ లేదు.

"సీటు మార్పేం కర్మం, సూపర్నెంటుగానే వేయించుకోవచ్చు. ఒక ఖాళీ కూడా ఉంది" మనసులోనే అనుకున్నాడు రంగనాథం.

ఉత్సాహంగా ఇంటికి చేరాడు రంగనాథం.

'ఏమండీ ?'

'ఊఁ' ఆలోచనల్లో ఉన్న రంగనాథం అన్నాడు.

'మంచి సోఫాసెట్టూ, డైనింగ్ టేబులూ కూడా కొనుక్కుందామండీ ?'

రంగనాథం 'అలాగే! ఇక పడుకో పొద్దుపోయింది' అన్నాడు.

"రేపే చేర్తారా కొత్తసీటులో ?"

"అవును !"

అర్థరాత్రిదాకా ఎవరూ నిద్రపోలేదు.

తెల్లవారి రంగనాథం అందరికంటే ముందుగా ఆఫీసుకు చేరాడు'

ఆఫీసరు రాగానే ఆయన గదిలోకి వెళ్ళాడు.

ఆఫీసరు ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతున్నాడు.

రంగనాథం వెళ్ళి ఎదురుగావున్న సీట్లో కూర్చున్నాడు.

ఫోన్లో మాట్లాడుతూనే ఆఫీసరు రంగనాథాన్ని పరిశీలనగా చూశాడు.

ఫోన్ పెట్టేసి 'ఏమిటీ' అన్నాడు.

'సర్ సూపర్నెంటు పోస్టు ఒకటి ఖాళీగా ఉంది' తడుముకోకుండా అన్నాడు.

ఆయన ఒక క్షణం అతని ముఖంలోకి చూసాడు.

'నీకంటే సీనియర్ ఉన్నాడుగా ?'

'అవుననుకోండి... కాని...'

'చూస్తాలే !' 'ఇక వెళ్ళు' అన్నట్టుంది ఆయన ధోరణి.

రంగనాథం అవేమీ పట్టించుకోలేదు.

'నాకు ఎస్టాబ్లిష్‌మెంటులో చెయ్యాలని ఉంది.'

ఆఫీసరు మాట్లాడలేదు. లోతుగా చూశాడు.

'ఒకే సీట్లో బోర్‌గా వుంది. ప్రమోషన్ తర్వాత చూద్దురుగాని. ముందు ఎస్టాబ్లిష్‌మెంటులో... అదే శర్మ సీట్లో వేయించండి.'

'ఊఁ'

'ఇవ్వాళే ఇస్తారా సర్ ఆర్డర్!'

'ఊఁ'

'థ్యాంక్యూ సర్!' అంటూ రంగనాథం ఉత్సాహంగా బయటికి వచ్చాడు.

ఠీవిగా, నిర్లక్ష్యంగా వెళ్తున్న రంగనాథాన్నే చూస్తూ ఆలోచనలోకి జారిపోయాడు ఆఫీసరు!

ఆ రోజంతా రంగనాథం ఉత్సాహంగా ఉన్నాడు. సూపర్నెంటు ఏదో చెబితే నిర్లక్ష్యంగా విని ఊరుకున్నాడు.

నాలుగు గంటలకు ఆఫీసరుగారి పి. సి. ఒక కవరు తెచ్చి ఇచ్చాడు.

కవరు చింపుతూ శర్మ ముఖంలోకి చూశాడు. శర్మ తలవంచుకొని ఫైలు చూస్తున్నాడు.

అందరి కళ్ళూ కుతూహలంగా రంగనాథంకేసి చూస్తున్నాయి. చాలా మందికి రంగనాథం అదృష్టంమీద అక్కసుగా ఉంది. మరో డిపార్టుమెంటులో ఆఫీసర్లకూ, మంత్రులకూ జోశ్యాతిష్యాలు చెప్పి ఆఫీసరు హోదావరకు చేరుకున్న వెంకట్రావ్ గుర్తొచ్చాడు.

కవరు విప్పి ఆర్డరు చదువుకున్న రంగనాథం ముఖం నల్లగా మారింది. తను కూర్చున్న కుర్చీతో సహా లోతు తెలియని అగాధంలోకి పడిపోతున్నట్టు అనిపించింది. కళ్ళు తిరిగి కుర్చీలోనే వాలిపోయాడు. దూరంగా పరుగెత్తుతున్న గుర్రాల డెక్కల చప్పుళ్లు విన్పిస్తున్నాయి.

అందరూ చుట్టూ చేరారు. ఎవరో ముఖంమీద నీళ్ళు చల్లి కర్చీపుతో ముఖం తుడిచాడు. రంగనాథం నీరసంగా కళ్ళు తెరిచాడు.

"ఏమైంది ?"

"రంగనాథాన్ని పాపం! డిస్పాచ్ సెక్షన్‌లో వేశారు"

శర్మ మాటలు విన్పించాయి రంగనాథానికి.

"పూర్ ఫెలో!"

'ఈ సెక్షనే నయం. శాంక్షన్స్! మరీ అంత తీసెయ్యాల్సిన సబ్జెక్టు కాదు.'

తలా ఒక మాటా అన్నారు.

రంగనాథం తల వేలాడేసుకొని బరువుగా ఇంటికి చేరాడు. ఉసూరుమంటూ కుర్చీలో కూలబడ్డాడు. వంటింట్లో మంచి మసాలా వాసనల గుబాళింపు ముక్కుపుటాలకు సోకింది.

"ఏమిటలా కూర్చున్నారు? కొత్తసీట్లో పని ఎక్కువగా ఉందా?" భార్య సుందరమ్మ ప్రశ్నించింది.

రంగనాథం పలకలేదు. ఓపిక లేనివాడిలా చూశాడు.

'బాగా అలసిపోయినట్టున్నారు. స్నానం చెయ్యండి. మీకు ఇష్టం అని బంగాళాదుంపలు వేయించి, మజ్జిగపులుసు పెట్టాను' అన్నది సుందరమ్మ భర్తను ప్రేమగా చూస్తూ.

రంగనాథం భార్య ముఖంలోకి దిగులుగా చూశాడు.

సుందరమ్మకు అనుమానం వచ్చింది.

"సీటు మారలేదా?"

"మారాను" నీరసంగా అన్నాడు.

'మరి అలా వున్నారేం?'



కథా నిలయం
శ్రీకాకుళం

"ఎస్టాబ్లిష్ మెంటు కాదు డిస్పాచ్ సెక్షన్‌లోకి మారాను."

సుందరమ్మ భర్తకేసి వెర్రిదానిలా చూసింది.

"నేను అనుకుంటూనేవున్నా నీముఖానికి అంతకంటే..."

సుందరమ్మ పంచాంగం విప్పింది.

రంగనాథం ఉలకలేదు, పలకలేదు.

"నా రాత! నా ఖర్మ! అందుకే అన్నారు. 'పుణ్యాం కొద్దీ పురుషుడు' అని."

సాధిస్తూ ఇంట్లోకీ బయటికీ పిచ్చెత్తినట్టు తిరగసాగింది.

బాగా పొద్దుపోయింది.

రంగనాథానికి ఆకలిగా ఉంది. అన్నం పెట్టమని భార్యను అడిగే ధైర్యం లేదు.

"బొచ్చలో కుంభం తోడాను, వచ్చి డొక్క పగల గొట్టుకోమని చెప్పవే!'' సుందరమ్మ కూతురుతో పెద్దగానే అన్నది.

రంగనాథం మనసు చివుక్కుమంది. ఛ! వెధవ బతుకు! అనుకుంటూ చివ్వున లేచి నిల్చున్నాడు.

బయటికి వెళ్ళాలనుకున్నాడు.

బంగళాదుంపల వేపుడూ, మజ్జిగ పులుసూ! కళ్ళముందు కదిలాయి.

లోపలకు నడిచాడు రంగనాథం.

o o o